# నేహాల



సాయిబ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత  సంచిక నుంచీ తరువాయి)

## 14

ఆ మర్నాడు ఉదయమే ఉమాదేవి మందిరానికి బయల్దేరాడు నరేంద్రగజపతి. క్రితం రాత్రి దేవరాయలకీ ఉమాదేవికీ మధ్య జరిగిన సంభాషణ తెలుసుకోవాలని ముందుగా అక్కడికే వెళ్ళాడు. వెళ్ళేసరికి ఉమాదేవి ఒక్కతే కనిపించింది.

వెళుతూనే దేవరాయల సంగతి అడిగాడు.

"ఏమయింది అక్కా? నిన్న రాత్రి బావగారు ఏమన్నారు?"

క్రితం రాత్రి దేవరాయలు తన మందిరానికి రాలేదని చెప్పింది.

"నడిరాత్రి వరకూ ఎదురుచూసాను. రాలేదు. ఎక్కడున్నదీ తెలీదు. బహుశా అంతరంగిక మందిరంలోనే రాత్రి పొద్దుపోయేవరకూ ఉండి వుండచ్చు."

"సరేలే! నేను వివరాలు తెలుసుకుంటాను. ఇవాళ మధ్యాన్నం ముద్గల్ వెళుతున్నాను. నాతోపాటు మూడొందల మంది సైన్యాన్ని తీసుకెళుతున్నాను. మహారాజెక్కడున్నాడో తెలుసుకుని కలుస్తాను. మన మధ్య జరిగినవి పొరపాటునకూడా మహారాజు ముందు నోరు జారకు." అంటొ హెచ్చరిస్తూ వెనుతిరిగాడు.

"నా ఆశలన్నీ నీ మీదే! ఎలాగయినా ఆ పిల్లని మాత్రం విజయనగరం రాకుండా చూడు." అంటూ తమ్ముణ్ణి సాగనంపింది.

అక్కడనుండి సరాసరి ఆంతరంగిక మందిరానికి వెళ్ళాడు. మహారాజు అప్పుడే నిద్రలేచి స్నానాది కార్యక్రమాలు చేస్తున్నాడని తెలిసి అక్కడే ఎదురుచూడ్డం మొదలు పెట్టాడు.

కొంతసేపటికి దేవరాయలు వచ్చాడు. ముద్గల్ వెళ్ళేముందు కలుద్దామని వచ్చానని అన్నాడు.

"మహారాజా! మీరు అప్పగించిన కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసుకొస్తాను. ఆ అమ్మాయిని బంధించి మీపాదాక్రాంతురాలిని చేస్తాను."

స్వయానా బావమరిదీ, ఉమాదేవి తమ్ముడూ ఈ పనిని భుజాన వేసుకోడం దేవరాయల మనసుకి కాస్త తెరిపిచ్చింది. ఇతన్ని అడ్డం పెట్టుకొని ఉమాదేవికి నచ్చ చెప్పచ్చనుకున్నాడు. అందుకే నరేంద్రగజపతి వెళతానంటే కాదన లేదు.

ఇంతలో వేదరాయశర్మనుండి కబురొచ్చిందనీ, మహారాజుని కలవడానికి ఒక వ్యక్తి వచ్చాడనీ ఒక సేవకుడు చెప్పాడు. ఆ వచ్చిన వ్యక్తిని ప్రవేశ పెట్టమని ఆదేశించాడు. ఆ వచ్చినదెవరోకాదు శంభుడు.

వస్తూనే మహారాజుకి నమస్కరిస్తూ - "మహారాజా, గురువుగారు వేదరాయశర్మ గారికి నిన్నటినుండీ వంట్లో నలతగా ఉంది. ఇవాళ మిమ్మల్ని కలవడానికి రాలేనని చెప్పమన్నారు." అని అన్నాడు.

"అలాగా? ఇవాళ చర్చించవలసిన విషయాలేమీ లేవు. కాస్త ఓపిక వచ్చాకే రమ్మనమను. ఈలోగా ఆస్థాన వైద్యులని పిలిపిస్తాను." అంటూ అక్కడే దూరంగా వున్న సేవకుడి వైపు చూస్తూ - "ఎవరక్కడ ఆస్థాన వైద్యులవారిని తక్షణమే రమ్మనమని మా మాటగా చెప్పండి." ఆదేశించాడు.

వైద్యులు వచ్చే వరకూ ఆగమనీ, వారొచ్చాక వేదరాయశర్మ విడిదికి తీసుకెళ్ళమని శంభుడికి చెప్పాడు. సరేనంటూ శంభుడు దూరంగా ఒక స్థంభం వద్ద నిలుచున్నాడు.

శంభుడి రాకనీ అతను తెచ్చిన వార్తనీ విన్నాడు నరేంద్ర గజపతి. పైకి ఏమీ అనలేదు. వేదరాయశర్మ రాకపోవడం మంచిదే జరిగిందనుకున్నాడు.

"మహారాజా! నేనూ వెళ్ళొస్తాను. ప్రయాణానికి సిద్ధం కావాలి. అన్నట్లు చెప్పడం మరిచాను. నాతో పాటు వందమంది సైన్యాన్నీ తోడుగా తీసుకెళుతున్నాను." తను సైనికాధికారికి మూడొందలమందని ముద్గల్ వెళ్ళాలనీ మహారాజు ఆదేశంగా చెప్పాడు. కావాలనే ఆ సంఖ్యని మూడొంతులు కుదించేసి చెప్పాడు.

"వందమంది సైన్యం దేనికి? వెళ్ళేది అమ్మాయిని తీసుకురావడానికి. యుద్ధానిక్కాదు కదా?" దేవరాయలు ప్రశ్నించాడు.

"లేదు మహారాజా! సైన్యం వచ్చారన్న భయంతో ఆ వూళ్ళో ఎవరూ ఎదురు తిరగరు. పైగా వెళ్ళేది రాయచూరు సమీపం వైపు. నాకెందుకో ఆ అమ్మాయి తిరస్కారం వెనుకా చాలా పెద్ద కారణమే వుండుండాలనిపిస్తోంది. కేవలం ఒక సామాన్య రైతు కూతురు మహారాజుని కాదనడం ఎక్కడా వినలేదు. ఆ అమ్మాయి వెనుక ఎవరివో అండదండలు బాగా ఉండి ఉండాలి. లేకపోతే అంత ధైర్యంగా రానూ అని చెప్పదు."

అర్థం కానట్టు చూసాడు దేవరాయలు.

"ఆ అమ్మాయి తిరస్కారం వెనుక ఎవరో ఉండే ఉండుంటారు. నా అనుమానం ప్రకారం గుల్బర్గా సుల్తాన్ వ్యూహం ఉందేమోననిపిస్తోంది."

ఈ మాటలు విని గట్టిగా నవ్వాడు దేవరాయలు.

"అలాంటిదేమీ లేదు. ఆ అమ్మాయెవరనుకున్నావు? వేదరాయశర్మ గారి శిష్యురాలు. పైగా గుల్బర్గా సుల్తాన్ మనుషులు మన రాజ్యంలో అడుగుపెట్టే అవకాశమే లేదు. రాయచూరు పొలిమేరలు కూడా దాటలేరు. నీదంతా ఒక పిచ్చి అనుమానం తప్ప ఏమీ కాదు."

మహారాజు ఖండించినా అక్కడితో ఆగలేదు నరేంద్ర గజపతి.

"మహారాజా! అనుమానం కాదు. నిజం. ఆ అమ్మాయిని బంధించాక మీకే తెలుస్తుందిలెండి. మీరామ్మాయిని మహారాణిగా ప్రకటించిన సంగతి తెలిసే ఉంటుంది. మనవాళ్ళు ముద్గల్ వెళ్ళేలోగా సుల్తాన్ మనుషులు ఆ అమ్మాయిని బెదిరించుండవచ్చు. అందుకే ఆ అమ్మాయి రానని అంత ధైర్యంగా చెప్పింది. ముందు మీరు పంపిన కానుకలు తీసుకొని మర్నాడే తిరిగిచ్చేస్తే దానర్థం ఏమిటి?"

దేవరాయలకి తర్కం మెల్లగా ఎక్కడం మొదలుపెట్టింది. నరేంద్ర గజపతి చెప్పింది తనకిన్నాళ్ళూ తట్టలేదు. లేకపోతే ఒక సామాన్య యువతి మహారాజుని కాదనడం ఎక్కడా కనీవినెరగ లేదు. ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయాడు.

"ఇలాంటి వాటివెనుక ఎవరిదైనా వ్యూహం ఉన్నదాని తెలుసుకోవడానికే నాతో సైన్యం తీసుకెళుతున్నాను. ఒకవేళ నేనూహించినది సరైనదయితే తక్షణమే వారిని మన సైన్యం ఎదుర్కొంటుంది. అసలు విషయం బయటపడుతుంది. అలాంటిదేదీ లేకపోయినా మరీ మంచిది. మన సైన్యం చూసి భయపడి ఆ అమ్మాయి తనంతటతాను మనకి లొంగుతుంది. ఎటుచూసినా మనకే మేలు. అందుకే నాతో పాటు వంద మంది సైన్యాన్ని తీసుకెళతానని మీకు చెప్పాను. అలాకాదూ వద్దంటారా? మీ ఇష్టం! నేనూ నా ఆంతరంగికుడూ వెళ్ళి ఉట్టిచేతులతో తిరిగొస్తాం!"

నరేంద్రగజపతి తన వ్యూహాన్ని పకడ్బందీగానే అమలు చేస్తున్నాడు. దేవరాయల బుర్రలోకి సుల్తాన్ పేరు చెప్పి సైన్యం అవసరం చొప్పించాడు.

దేవరాయలు నరేంద్రగజపతిని నమ్మాడు.

"నువ్వు చెప్పింది నాకిన్నాళ్ళూ తట్టలేదు. రాయచూరు తిరుగుబాటులో అవమానాం ఆ గుల్బర్గా సుల్తానులకింకా పచ్చిగానే ఉండుంటుంది. మన రాజ్యంలో ఏం జరుగుతూందాని వేగుల్ని పంపే ఉండచ్చు. నువ్వు చెప్పేదీ సబబేననిపిస్తోంది. సరే! సైన్యాన్ని తీసుకెళ్ళు." అని అన్నాడు.

తన ఉచ్చులో దేవరాయలు పడ్డందుకు నరేంద్రగజపతి లోలోపల సంతోషించాడు. పైకి మాత్రం మహారాజు రాజనీతినీ మెచ్చుకున్నాడు.

దూరంగా వీరి సంభాషణ పూర్తిగా విన్నాడు శంభుడు. సైన్యం అంటే కాస్త భయం కలిగింది. మనసేదో కీడు శంకించింది. నేహలకి ఆపద సంభవిస్తోందన్న భావన కలిగింది. నేహలంటే తనకి అసూయుంది. అది కేవలం రేవన్న వరకే! తనని అవమానించిందన్నంత వరకే! అంతేకానీ ఇలా ఆమె ప్రాణానికే ముప్పు కలుగుతుందన్న తలంపు అతనిలో జాలిని పుట్టించింది. వీళ్ళు నేహలని బంధించి తీసుకు వస్తే అభ్యంతరం లేదు. అలా కాకుండా ఆమె రానని అంటే కోపంతో ఆమెను చంపేస్తే? ఆ ఊహే తట్టుకో లేకపోయాడు. ఈ విషయం వెంటనే గురువుగారికి చేరవేయాలనుకున్నాడు. ఆయనే మహారాజుకి ఏ ఆపదా రాకుండా నచ్చ చెప్పగలడు.

ఈలోగా ఆస్థాన వైద్యుడొచ్చాడు. అతన్ని తోడ్కొని వేదరాయశర్మ మందిరానికి వెళ్ళమని ఆదేశించాడు దేవరాయలు. వెళుతూ వెళుతూ లేని ధైర్యాన్ని కూడదీసుకుని మహారాజుకి గురువుగారి విన్నపంగా నోరువిప్పాడు శంభుడు.

"మహారాజా! చెప్పడం మరిచాను. ముద్గల్ వెళ్ళే వారిని ఎటువంటి రక్తపాతమూ లేకుండా విజయంగా రమ్మనమని చెప్పమన్నారు. ఎవరికీ ప్రాణహాని కలిగించవద్దని మనవి చేయమన్నారు."

ఒక్కోమాటా ఇలా ధైర్యంగా చెప్పడానికి శక్తెక్కడనుండి వచ్చిందో శంభుడికి తెలీదు. చెప్పాలనుకున్నది చెప్పడు.

"ఆ అమ్మాయికీ, ఆమె బంధువులకీ ఎటువంటీ ఆపదా రాదని మా మాటగా గురువుగారికి చెప్పు." అని చెప్పి పంపించేశాడు.

వెళుతూ వెళుతూ నరేంద్ర గజపతికేసి ఒక్కసారి వెనక్కి తిరిగి చూసాడు శంభుడు. ఎందుకో నరేంద్రగజపతి చూపుల వెనుక దుర్మార్గపు చారలు కనిపించాయతనికి.

ఆ తరువాత దేవరాయల వద్ద శలవు తీసుకుంటూ అక్కడనుండి నిష్క్రమించాడు. ఈ సారీ నేహల వివరాలు అడగలేదతను. అసలడగాలన్న ఆలోచనే అతనికి తట్టలేదు. అతను వెళ్ళేది ఆమెను తీసుకు రావడానిక్కాదు. ఆమెను పైకి సాగనింపడానికి.

●●●

తన క్షేమం కోసం వైద్యుణ్ణి శంభుడి కూడా పంపినందుకు సంతోషించాడు వేదరాయశర్మ.

నరేంద్ర గజపతికీ, మహారాజుకీ మధ్య జరిగిన సంభాషణ వెళ్ళగానే శంభుడు చెప్పలేదు. రాజ వైద్యుడి ఎదుట నోరిప్పడం అతనికిష్టం లేదు. పొరపాటున ఏం మాట్లాడితే ఏం నష్టం వస్తుందోననుకున్నాడు. ఇంతవరకూ జరిగిన సంఘటనలు చూసాక భయం కలిగిందతనికి.

వేదరాయ శర్మకి బడలిక వల్ల కాస్త వంట్లో నలత చేసిందనీ, తన దగ్గరున్న చూర్ణం నీళ్ళల్లో కలుపుకు తాగమని చెప్పి వెళిపోయాడు. పసుపు నీళ్ళు ఆవిరి పట్టమని చెప్పి వెళిపోయాడు. అతనలా వెళ్ళగానే దేవరాయలకి రాజమందిరంలో జరిగింది చెప్పాడు శంభుడు.

"గురువుగారూ! నా మనసేదో కీడు శంకిస్తోంది. అనవసరంగా నేహల ఈ ఉచ్చులో చిక్కుకుపోయింది. దీనికంతటికీ ఒక రకంగా నేనే కారణం. ఆ నాడు చిత్రపటం వేసుండకపోతే అసలిదంతా జరిగేది కాదు కదా?" అంటూ కళ్ళనీళ్ళు తిరిగుతూండగా పశ్చాత్తాపం చెందాడు.

"ఏం కాదురా! నేహల మొండిది. అందువల్లే ఈ అనర్థాలన్నీ వచ్చాయి. మహారాజు పంపిన కానుకలు వెనక్కిచ్చేసిందనే ఆగ్రహం తప్ప వేరేదేమీకాదు. ఈ సారి అంతా మంచే జరగాలని ఆ అశ్వత్థ నారాయణున్ని ప్రార్థిస్తున్నాను. అంతకుమించి మనం చేసేదేమీ లేదు. అంతా చేజారిపోయింది." బాధపడ్డాడు వేదరాయశర్మ.

"గురువుగారూ, మీరెంత చెప్పండి. నాకెందుకో నేహలకి ఏదో చెడు జరుగుతుందనిపిస్తోంది. మీరనుమతిస్తే నేను ముద్గల్ వెళిపోతాను. ముందుగా వెళ్ళి నేహల వాళ్ళకి జరిగింది చెప్పి రక్షిస్తాను. నా మాట కాదనకండి. నేను తక్షణమే ముద్గల్ వెళతాను."

గురువుగారిని ప్రాధేయపడ్డాడు శంభుడు. కాదనలేకపోయాడు వేదరాయశర్మ.

"జాగ్రత్త! ఈ నాలుగు వరహాలూ దగ్గరుంచుకో! అనవసరంగా ఆవేశపడి ఈవిషయం ఎవరికీ చెప్పద్దు. నా మాటగా నేహలకీ, హరీంద్రకీ భయపడొద్దనీ చెప్పు. అసలు ముందు నేహలని శాంతం వహించమని చెప్పు. ఆవేశాలకిపోతే అనర్థాలు వస్తాయని హెచ్చరించు." అని శిష్యుణ్ణి ఆశీర్వదించి ముద్గల్ పంపాడు.

గురుగవుగారు సరేననడంతో వెయ్యేనుగుల బలం వచ్చింది శంభుడుకి. ఒక్క క్షణం ఆలస్యం చెయ్యకుండా బయల్దేరాడు.

గంగావతి బండిలో వెళదామని విరూపాక్ష దేవాలయ కూడలి వద్దకొచ్చాడు. అక్కడ ఒక్క బండి కూడా కనిపించలేదు. దగ్గర్లో ఉన్న ఒక దుకాణదారుణ్ణి అడిగాడు.

"ఏమయ్యిందయ్యా, ఇవాళ? గంగావతి వెళ్ళే బళ్ళు అప్పుడే వెళిపోయాయా?"

"మహారాజు గారి సైన్యం కాసేపట్లో ఈ రహదారి గుండా వెళుతూందని ప్రజలనెవర్నీ ఇవాళ గంగావతి వైపు వెళ్ళొద్దనీ ఇప్పుడే చాటింపు వేసారు. అందువల్ల బళ్ళవాళ్ళు వెనక్కి వెళిపోయారని చెప్పాడు.

ఏం చెయ్యాలో పాలుపోలేదు శంభుడికి. గత్యంతరం లేక కాలినడకనే బయల్దేరాడు. సైన్యం గంగావతి చేరకమునుపే తను అక్కడకి వెళ్ళాలి. గంగావతినుండి ఏదో ఒక బండిని బాడుక్కి తీసుకు వెళ్ళచ్చు. ఎలాగయినా తను సైన్యం కంటే ముందుగా ముద్గల్ చేరాలి. అదే అతని ధ్యేయం. కాలినడకన సాయంత్రంలోగా గంగావతి చేరుకోగలడు. మర్నాడు తెల్లవారు ఝామునే ముద్గల్ వెళ్ళచ్చని అనుకున్నాడు.

ఎక్కడా విశ్రాంతి తీసుకోకుండా కాలినడకని సాగించాడు. చీకటి పడకుండే సమయానికి గంగావతి చేరుకున్నాడు.

తనూ, గురువుగారూ ఎప్పుడు బస చేసే సత్రానికే వెళ్ళాడు. వెళ్ళగానే స్నానం చేసి బయటకొచ్చాడు. మర్నాడు ముద్గల్ వెళ్ళడానికి ముందుగానే బండిని మాట్లాడుకుండామని అనుకున్నాడు. బయటకి వస్తూండగా ఒకతను సత్రంలో ఆ రాత్రి బసకి చోటుందాంటూ ప్రశ్నించాడు.

"ఏమోనయ్యా! నేనూ ఇప్పుడే వచ్చాను. లోపలకెళ్ళడుగు." అని సమాధానం చెప్పాడు.

"అలాగేనయ్యా! ఏమయ్యిందీ వూళ్ళో? ఇక్కడ గొడవలేవయినా జరిగాయా?" అంటూ మరో ప్రశ్న వేసాడు. తనకేమీ తెలీదన్నట్లుగా చూసాడు శంభుడు.

"ఏమో? నేనూ ఇందాకనే వచ్చాను. గొడవలేమిటి?"

"లేదు. నేనూ ఇప్పుడే రాయచూర్నుండి వస్తున్నాను. గంగావతి పొలిమేరలు సమీపిస్తూండగా ఊరి చివర్న సైన్యం గుర్రాల మీద వెళుతూ కనిపించారు. అందుకని అనుమానమొచ్చి అడిగానంతే!"

గుర్రాలూ, సైన్యమూ అనగానే ఉలిక్కిపడ్డాడు శంభుడు. తనకంటే ముందే నరేంద్రగజపతి సైన్యం వెళిపోయిందా? అనుకుంటూ మనసులో కంగారు పడ్డాడు. పైకి ఏమాత్రం కనబడనీయకుండా తెలీదని చెప్పాడు.

"చూడ్డానికి సైన్యం ఎక్కువే ఉన్నారు. మూడొందల మందుండచ్చు. ఒడ్డరహట్టి గ్రామం దగ్గర విడిది చేసారనుకుంటా ఈ రాత్రికి. అక్కడే కొన్ని గుడారాలు కనిపించాయి." అంటూ చెప్పాడు. ఒడ్డరహట్టి గంగావతికీ దూరం అంతగా లేదు.

తొందరగా గంగావతి చేరుకోవాలన్న ధ్యేయంతో తను అడ్డదారినొచ్చాడు. సైన్యం వేరే బాటలో వచ్చుండచ్చు. పైగా వాళ్ళందరూ గుర్రాల మీద వెళుతున్నారు. కాబట్టి అంత సమయం పట్టదనుకున్నాడు.

తనూ విజయనగరం నుండి వచ్చాననీ తనకేమీ తెలీదని అబద్ధం చెప్పాడు శంభుడు. సైన్యం అనగానే అతనికి విషయం అర్థమయ్యింది.

"ఏ వూరెళ్ళాలి?" ఆ వ్యక్తే మరలా అడిగాడు.

"నేనా? ముద్గల్ వెళ్ళాలి..మా వాళ్ళకి ఒంట్లోబాగోలేదని కబురొచ్చింది. రాత్రికి రాత్రి వెళ్ళలేక ఉదయమే వెళదామని

ఇక్కడుండిపోయాను." అంటూ ఏమీ తెలీనట్లు చెప్పాడు శంభుడు.

అతనూ ఆ రాత్రికి ఆ సత్రంలోనే బస చేసాడు. భోజనాల దగ్గర దేవరాయలు ముద్గల్లో ఒక అమ్మాయిని పెళ్ళి చేసుకుంటానంటే కాదన్న విషయం అందరూ మాట్లాడుకున్నారు. తనకేమీ సంబంధం లేనట్టుగానే అంతా విన్నాడు.

పడుకుందామనుకుంటూండగా ఆ రాయచూరు వ్యక్తి శంభుడి దగ్గరకొచ్చి అడిగాడు.

"నే విన్నది నిజమేనా? మహారాజుని ముద్గల్లో అమ్మాయి కాదంటే బంధించి తీసుకు రమ్మనమని సైన్యాన్ని పంపాడని?" ఆ రాయచూరు వ్యక్తి గుచ్చి గుచ్చి ప్రశ్నలడిగాడు. శంభుడు తనకేమీ తెలీదన్నట్లే మాట్లాడాడు.

తెల్లారి వెళ్ళాలంటూ, పడుక్కుంటానని చెప్పి పక్కగా ఒత్తిగిల్లాడు శంభుడు.

●●●

ఒడ్డరహట్టి ఊరిచివర్న గుడారాలు వేసుకొని రాత్రికి అక్కడే బస చేసాడు నరేంద్ర గజపతి.

దేవరాయలకి వందమంద సైన్యం అని చెప్పి మూడొందలకు పైగా సైన్యాన్ని సమాయత్తం చేసాడు. ఆ రాత్రికి తమతో తెచ్చుకున్న భోజనం చేసారు. సమయం తక్కువగా ఉండడం వల్ల సైనికుల్ని ఎవరికి కావాల్సిన తిండి వారే తెచ్చుకోవాలనీ ముందుగానే చెప్పాడు. భోజనాలు అయ్యాక దండనాయకుల్ని సమావేశపరిచాడు.

"మనం రేపు సూర్యోదయం కాకుండానే బయల్దేరాలి. మధ్యాన్నానికల్ల ముద్గల్ చేరుతాం. వెళ్ళగానే మీరు ఆ గ్రామాన్ని చుట్టుముట్టండి. ఆ అమ్మాయి ఎక్కడికీ తప్పించుకు పారిపోకూడదు. ఆ అమ్మాయిని బంధించి నా దగ్గరకు తీసుకు రండి. అడ్డొచ్చి ఎదురించిన ఎవర్నీ ఉపేక్షించకండి. ఇది మహారాజు ఆజ్ఞగా మా ఆదేశం! అర్థమయ్యిందా?"

అలాగే నన్నట్లు తలూపారు దండనాయకులు. కానీ ఆ అమ్మాయెవరో ఎవరికీ అర్థం కాలేదు.

"అయ్యా ఇంతకీ..ఆ అమ్మాయి పేరూ, వివరాలూ చెబుతారా?" అంటూ ఒక దండనాయకుడడిగాడు.

పేరూ, వివరాలూ అనగానే ఒక్కసారి తడబడ్డాడు నరేంద్ర గజపతి.

"ఆ ఆమ్మాయి పేరు..అదేమిటి..?" గుర్తు రాలేదతనికి. గుర్తురావడానికి అతను ఎవర్నీ అడిగితే కదా?

"చ! హఠాత్తుగా ఈ విధి నిర్వహణలో ఆ అమ్మాయి పేరు అడగడం మర్చిపోయాను. అయినా ఏం నష్టం లేదు. ముద్గల్ చేరగానే అక్కడ ఎవర్నడిగినా చెబుతారు. అంతగా కాదంటే ఆ వేదరాయశర్మ ఇల్లు కనుక్కుని వాళ్ళనడుగుదాం."

చెప్పింది విని పైకి నవ్వు వస్తున్నా బలవంతాన ఆపుకున్నారు దండనాయకులు.

"అలాగే! మీరు చెప్పినట్లుగానే అక్కడ వాళ్ళని అడిగి తెలుస్కుంటాం." అని మాత్రం అన్నారు.

"ఇంకోటి! ఎవరైనా ప్రశ్నించినా, వివరాలడిగినా లెక్కపెట్టద్దు. అవసరమయితే ఆ వూరు మొత్తం గాలించండి. ఆ అమ్మాయి జాడ తెలిసే వరకూ వదిలిపెట్టద్దు. అడుగడుగునా వెతకండి. అవసరమయితే ఊరిని లూటీ చేయండి. ప్రజల్ని భయభ్రాంతుల్ని చెయ్యండి. ఎవరైనా ఆ అమ్మాయికి ఆశ్రయమిచ్చి, దాచారని తెలిసినా ఊరుకోవద్దు. ప్రాణాలూ తీయడానిక్కూడా వెనుకాడకండి. ఇది విజయనగర మహారాజు ప్రతిష్టకి సంబంధించిన విషయం. కాబట్టి ఆ ఊర్లో ఎవర్నీ వదలద్దు. మనం ఉట్టి చేతులతో వెనక్కి తిరిగి వెళ్ళకూడదు."

అతని గొంతులో కర్కశత్వం ధ్వనించింది. నరేంద్ర గజపతి చెప్పిన విషయాన్ని మిగతా సైనికులకి ఆ రాత్రికే సమావేశ పరిచి చెప్పారా దండనాయకులు.

●●●

అలసటతో పడుక్కున్నాడే కానీ, ఒ రాత్రి వేళ మెలకువ వచ్చింది శంభుడికి. కళ్ళు నులుపుకుంటూ లేచి చుట్టూ చూసాడు. సన్నని దీప కాంతిలో వసారాలో పడుక్కున్న వారి ముఖాలు స్పష్టంగా కనిపించాయి. ఆ చీకట్లో వాళ్ళ గురకలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. ఎప్పుడు తెల్లారుతుందాని ఎదురు చూస్తున్నాడు. కాస్త వెలుతురు రాగానే బయల్దేరచ్చు. వీలయితే ఒడ్డిరహట్టి సైన్యం కంటే ముందు దాటాలి. తను ఎలాగయినా ముద్గల్ చేర్చమని పరిపరి విధాల దేవుణ్ణి ప్రార్థించాడు. అతని ఆలోచనలన్నీ నేహల చుట్టూనే తిరుగుతున్నాయి. ముందుగా నేహలని కలిసి విషయం చెప్పాలి. మహారాజుకి ఆగ్రహం వస్తే ఆమెకి మంచిది కాదు. అనవసరంగా గొడవలు వద్దని చెప్పాలి. తన తప్పిదాన్ని కూడా చెప్పి క్షమాపణలు కోరాలి.

నరేంద్ర గజపతి మాటల్లోనూ, తీరులోనూ అతనికి అనుమానాలు కలిగాయి.

ఇంతలో కోడి కూత వినిపించేసరికి తెల్లారుతోందని అనుకున్నాడు. లేచి ముఖ ప్రక్షాళన చేసుకుని తన మూట తీసుకొని బయటకి వచ్చాడు. వీధి అరుగు మీద కొంతమంది పడుకుని కనిపించారు.

మెల్లగా నాలుగు వీధుల కూడలి వైపు నడిచాడు. అక్కడే ముద్గల్ వెళ్ళే బళ్ళుంటాయి. తెల్లారేలోగా ఒడ్డరహట్టి దాటి కనకగిరి చేరుకుంటే చాలు. అక్కడనుండి అడ్డదారిన ముద్గల్ త్వరగా చేరుకోవచ్చు. మామూలు రహదారయితే చాలా సమయమే పడుతుంది. సైన్యం ఎంత లేదనుకున్నా రాత్రికి కానీ ముద్గల్ చేరుకోలేరు. తను ఎలాగయినా సాయంత్రానికి చేరుకుంటే చాలు. ఆలోచిస్తూ నడుస్తూండగా దూరంగా గుర్రపు డెక్కల చప్పుడు వినిపించింది.

ఎవరో గుర్రమ్మీద వస్తూ కనిపించారు. ముందుగా సైనికుడనుకున్నాడు. మెల్లగా ఆ గుర్రం అతని దగ్గరగా వచ్చి ఆగింది. ఆ గుర్రంపైన వ్యక్తి తలపాగ ధరించాడు. చీకట్లో ముఖం పోల్చుకోలేకపోయాడు.

"ఎక్కడికి? " అంటూ గుర్రం దిగకుండానే ప్రశ్నించాడా వ్యక్తి.

శంభుడు తను ఎక్కడకి వెళ్ళాలో చెప్పాడు. శంభుడు చెప్పిన దాన్ని బట్టి అతని గొంతుని గుర్తించాడా వ్యక్తి.

"ఓ మీరూ గంగావతి ధర్మసత్రం నుండే వస్తున్నారు కదూ? నిన్న రాత్రి మనం మాట్లాడుకున్నాం. మీ బంధువులెవరికో సుస్తీ చేసిందని ముద్గల్ వెళ్ళాలని చెప్పారు మీరు.."

శంభుడికి క్రితం రాత్రి కలిసిన వ్యక్తని తెలిసింది. ముందు రూపం గుర్తు రాక మళ్ళీ అడిగాడు. ఆతను రాయచూరు వెళ్ళాలుకున్నట్లుగా చెప్పాడు.

"మీరు నన్ను కనకగేరి దగ్గర దింప గలరా? అక్కడనుండి ముద్గల్ వెళ్ళడం తేలిక. ఈ సమయంలో బాడుగ దొరకడం కష్టం. మీరు నాకు ఉత్తినే సాయం చెయ్యనవసరం లేదు. మీకు నేను నాలుగు వరహాలిస్తాను." శంభుడు అతని కేసి చూస్తూ జాలిగా మొహంపెట్టి అడిగాడు.

రాయచూరు గంగావతికి ఈశాన్యాన్నుంది. ఒడ్డిరహట్టి దగ్గరనుండి ముద్గల్లూ, రాయచూర్ల దారులు వేరవుతాయి. ఆతను ఒడ్డిరహట్టి వరకూ తీసుకెళతాననీ ఒప్పుకున్నాడు. ఆతను సరే ననగానే గుర్రమెక్కాడు శంభుడు.

దారిలో దేవరాయల ప్రస్తావన మళ్ళీ వచ్చింది. ఆతను ముద్గల్లో ఒక అమ్మాయిని రాణిగా ఆహ్వానం పంపితే ఆమె తిరస్కరించిందన్న విషయం ప్రస్తావనకి తీసుకొచ్చాడు. ఆ సంభాషణల మధ్యలో తనని తాను అదుపు చేసుకోలేక శంభుడు జరిగినదంతా పూసగుచ్చినట్లు చెప్పాడు. తనవాళ్ళెవరూ అనారోగ్యంతో లేరనీ, తను అబద్ధం చెప్పాననీ చెబుతూ, నేహలని రక్షించడానికే తను వెళుతున్నట్లుగా చెపాడు. శంభుడు చెప్పినదంతా విని ఆ వ్యక్తి ఆశ్చర్యపోయాడు. మహారాజు నరేంద్ర గజపతిని పంపడంలో వేరే ఉద్దేశ్యమేదో ఉండుంటుందని అన్నాడు. ఆ అమ్మాయిని ఎలాగయినా రక్షించడానికి తనూ సాయం చేస్తానని, తనూ ముద్గల్ వరకూ వస్తానని చెప్పాడు.

ఆతను చూపిస్తున్న సహృదయతకి శంభుడు కరిగిపోయాడు. సాయంత్రానికల్లా ముద్గల్ చేరిస్తే తను ఇంటికి వెళ్ళగానే పది వరహాలిస్తానని ప్రమాణం చేసాడు.

కనకగేరికి దారి తనకి తెలుసునని అక్కడనుండి ముద్గలుకి అడ్డదారిన వెళదామనీ చెప్పాడు శంభుడు.

ఎక్కడా ఆగకుండా ముందుకు సాగారు వాళ్ళిద్దరూ!

ఆ వ్యక్తి చేసిన మేలు ఎప్పటికీ మరవలేననీ కృతజ్ఞతలు చెప్పాడు శంభుడు. ఆతను ఎక్కడుంటాడు, రాయచూరులో ఏం చేస్తాడు వివరాలడిగాడు. ఆతను రాయచూరులో రాళ్ళ తాపన పని చేస్తానని అన్నాడు.

"అడగడం మర్చిపోయాను. మీ పేరేవిటి? " శంభుడు అతన్ని ప్రశ్నించాడు.

"నా పేరా.. మాసూ..బసప్ప" తడబడుతూ చెప్పాడతను.

కొంతసేపు ప్రయాణించి వాళ్ళు ఒడ్డిరహట్టి చేరుకున్నారు. ఊరి చివర గుడారాలు కనిపించాయి. సైనికులు గుర్రాలను సిద్ధం చేసుకుంటూ కనిపించారు.

●●●

అప్పటికి తెల్లారింది. అప్పటికే నరేంద్ర గజపతి సైన్యం ముద్గల్ చేరుకోడానికి సిద్ధమయ్యారు.

శంభుడూ, బసప్పా ఒడ్డిరహట్టి ఊరి చివర్న సైన్యం గుర్రాలను సిద్ధం చేస్తూ కనిపించారు. అటుగా చూడసారు కానీ వాళ్ళు అక్కడ ఆగలేదు. వేగంగా ముందుకు సాగిపోయారు. ఎక్కడా ఆగకుండా ప్రయాణించి కనకగేరి చేరుకున్నారు. అక్కడనుండి వేరే దారిన వెళ్ళడానికి శంభుడి సూచనలు అనుసరించాడు బసప్ప. చాలా సేపు ప్రయాణించాకా తవరగేరి చేరుకున్నారు. అప్పటికే సూర్యుడు నడినెత్తిన దాటి చాలా సేపయ్యింది. తవరగేరి నుండి ముద్గల్కి కాలినడకన మధ్యాన్నం బయల్దేరితే చీకటిపడకుండా చేరచ్చు. కొంత సేపు అక్కడ విశ్రమించారు. ప్రయాణ బడలికలో కునుకు పట్టేసింది. మెలుకవ వచ్చేసరికి సూర్యుడు పడమటి వైపుగా వంగుతూ కనిపించాడు. ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా అక్కడనుండి హుటాహుటిన బయల్దేరారు.

కానీ అప్పటికే ఆలస్యమయిపోయింది. నరేంద్రగజపతి సేనలు ముద్గల్ ఊరుని సమీపించాయి. దూరం నుండి ఆ సేనల్ని చూసి మచ్చెమటలు పోసాయి శంభుడికి. వేగంగా వేరేదారిన ఊళ్ళోకి వెళ్ళమని బసప్పని ఆదేశించాడు. హుటాహుటిన నేహల వాళ్ళింటికెళ్ళారు. ఇంటికెళ్ళే సరికి హరీంద్రా వీధరుగు మీద కనిపించాడు. ఒగరుస్తూ ఒక్క ఉదుటున గుర్రం దిగాడు శంభుడు.

నేహలెక్కడ? అయ్యా మీరందరూ ఉన్నపళాన పారిపోండి. మహారాజు మిమ్మల్ని బంధించి తీసుకురమ్మనమని సైన్యాన్ని పంపాడు. సైన్యం ఊళ్ళో అడుగుపెట్టింది." కంగారుగా అన్నాడు.

హరీంద్రకి అతను చెప్పేది అర్థం కాలేదు. మరలా వివరం అడిగితే పరిస్థితి ఎంత ముదిరిందో అర్థమయ్యింది. ఆ క్షణంలో నేహల ఇంట లేడు. అశ్వత్థనారాయణ కోవెలకెళ్ళిందని చెప్పాడు.

కోవెలనగానే రేవన్నా అక్కడే ఉండచ్చనుకున్నాడు. హుటాహుటిన కోవెల వైపు బయల్దేరాడు. హరీంద్ర కంగారుగా లోపలికెళ్ళి భార్యకి విషయం చెప్పాడు. శంభుడూ, బసప్ప వెళ్ళిన వెంటే వాళ్ళూ పరిగెత్తుకుంటూ వెళ్ళారు.

వెళుతూనే అశ్వత్థనారాయణ కోవెలంతా గాలించారు. ఎక్కడా కనబడ లేదు. శంభుడికి నేహలా, రేవన్న ఆలయం వెనుకున్న కోనేరు దగ్గరుండచ్చని అటుగా పరిగెత్తాడు. అందరికళ్ళల్లోనూ ఒకటే భయమూ, ఆందోళనా. ఎవరున్నారూ అన్న ధ్యాస లేదు. వాళ్ళ కళ్ళన్నీ నేహల గురించే వెతుకుతున్నాయి. కోనేరు మెట్లమీద నేహలా రేవన్నా కనిపించారు శంభుడికి. ఆయసపడుతూ వాళ్ళని సమీపించి విషయం చెప్పాడు. రేవన్న ఈ హఠాత్పరిణామానికి విభ్రాంతి చెందాడు. నేహలకి భయం వేసింది. అప్పా అంటూ తండ్రిని చుట్టుకుపోయింది. బసప్పని చూసి అతనికేమీ అర్థం కాలేదు.

"మసూం! నువ్వా?" ఆశ్చర్యపోయాడు రేవన్నా. బసప్పని మసూంగా సంబోధించడంతో ఈసారి ఆశ్చర్యపోవడం శంభుడి వంతయ్యింది. రేవన్నకీ, బసప్పకీ మధ్యనున్న పరిచయం ఏమిటో అస్సలు బోధపడలేదు. అంతా గందరగోళంగా అనిపించింది. రేవన్న క్లుప్తంగా వివరం చెప్పాడు.

"రేవన్నా! నువ్వు తక్షణమే నేహలనీ, తల్లితండ్రుల్నీ ఎక్కడికైనా తీసుకెళ్ళు. మహారాజు సైన్యం వస్తే ప్రమాదం!" అని హెచ్చరించాడు మసూం.

రేవన్న ఓ క్షణం నిదానంగా ఆలోచించాడు. ప్రస్తుత పరిస్థితుల్లో రాయచూరు వైపుగా వెళ్ళి అక్కడ తలదాచుకోడమే మంచిదని అనుకున్నారు.

"హరీంద్రగారూ! నేను నేహల్ని తీసుకొని రాయచూరు వైపుగా వెళతాను. మిమ్మల్ని తీసుకొని ఈ రాత్రికి ఎవరికంటా పడకుండా శంభుడు మిమ్మల్ని తీసుకొస్తాడు.

మసూం తన ఇంటికి నేహలని తీసుకెళ్ళడమే మంచిదన్నట్లుగా చెప్పాడు. రేవన్నా అదే సరైనదని అన్నాడు.

"నేహలా! నువ్వూ, నేనూ ముందెళదాం. మసూం మీ వాళ్ళని తీసుకొస్తాడు." అని చెప్పి, మసూం వైపు తిరిగి - "మసూం! నువ్వు వీళ్ళని తీసుకుని రాత్రికి రాత్రి బయల్దేరి రా! అంతవరకూ ఊరిచివర ఎక్కడైనా దాక్కోండి. ఎట్టి పరిస్థితుల్లోనూ మీ ఇంటి వైపు వెళ్ళద్దు. శంభూ, నువ్విక్కడుండం నీకూ మంచిది కాదు. మీ ఇంటికెళిపో! నిన్ను ఆ నరేంద్ర గజపతి గుర్తిస్తే ప్రమాదం." అంటూ రేవన్న తన పథకం చెప్పాడు.

అందరూ సరేనని ఒప్పుకునారు.

లింగసుగూర్లో నేహలా వాళ్ళ మావయ్యింటికి వెళదామని నిశ్చయించుకున్నారు. అక్కడనుండి రాయచూరుకి వెళితే ఎవరూ గమనించకపోవచ్చు.

"హరీంద్ర గారూ! మీరూ ఇక్కడుండడం క్షేమం కాదు. ఈ రాత్రికి మీరూ లింగసుగూర్ వచ్చేయండి. ఆ తరువాత ఏం చేద్దామన్నది ఆలోచిద్దాం.." రేవన్న చెప్పినదానికి సరేనన్నాడు హరీంద్ర. అతనికి నోట మాటలేదు. అంతా అయోమయంగా వుంది.

నేహల్ని గుర్రంపై ఎక్కించుకుని బయల్దేరాడు రేవన్న. కళ్ళనీళ్ళ పర్యంతమవుతూ అటుగా చూస్తూ ఉండిపోయారు నేహల తల్లితండ్రులు. నేహల మొహంలో భయమూ, ఆందోళనా స్పష్టంగా కనిపించాయి.

ముద్గల్ గ్రామాన్ని మెల్లగా చీకటి కమ్ముకుంది.

●●●

(కొనసాగింపు వచ్చేసంచికలో)

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంధాలయాన్ని సందర్శించండి..




Click here to go to KOUMUDI Library

Click here to share your comments on this serial